క్లుప్తంగా

డీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా శ్రీనాథ్



కమలాపూర్ : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండల శాఖ అధ్యక్షుడిగా టి.శ్రీ నాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం డీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి బి.అంజనీదేవి, పరిశీలకులు ఎ.సంజీవరెడ్డి, డి.రమేష్ తెలిపారు.మండల ప్రధాన కార్యదర్శిగా ఎం.సువర్ణ, ఉపాధ్యక్షులుగా సీహెచ్.కుమారస్వామి, కె.జ్యోతి, ఎం.కొమురయ్య, కార్యదర్శులు గా పి.వాసు, యు.సుమలత, ఎన్.శ్రీనివాస్, జి.మధుమిత, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.హరీష్, జిల్లా కౌన్సిలర్లుగా ఎ.సంజీవరెడ్డి, డి.రమేష్, ఎ.సత్తమ్మ, ఎం.శ్రీవాస్, కె.శేషగిరిరావు, ఎ.చంద్రమోహన్‌రెడ్డి, డి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం



దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెల్ల బీఆర్ఎస్ అధ్యక్షుడు హింగె శ్రీనివాస్ తల్లి రాధాబాయి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి బుధవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, మాజీ జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, ఎంపీపీ కాగితాల శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, బత్తిని రాజు, నేరెళ్ల కమలాకర్, రమేష్, శరత్ తదితరులు ఉన్నారు.

సంజనకు సన్మానం

కమలాపూర్ : మండలంలోని మర్రిపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థిని పొరండ్ల సంజన ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో 464 మార్కులు సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం బుధవారం ఆమెను అభినందించి సన్మానించారు. హెచ్ఎం రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, ముఖ్యంలో చదువులో అత్యంత ప్రతిభ కనబరుస్తూ అత్యధిక మార్కులు సాధిస్తున్నారని, ఇది గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమన్నారు. గ్రామంలోని విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని కోరారు.

ముగిసిన బడులు.. విద్యార్థులు ఇంటికి పయనం



శాయంపేట : తెలంగాణ ప్రభుత్వం గురువారం నుంచి జూన్ 12 వరకు వేసవి సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు బుధవారం తమ ఇంటికి పయనమయ్యారు. స్థానిక సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, మహత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఎంజేపీ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఎండలో తిరుగవద్దని, ఇంటి వద్ద ఉండి చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు బావుల్లో, చెరువుల్లో ఈతకు వెళ్లకూడదని, ఈతకు వెళ్లితే ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఉండి చదువుకోవాలని సూచించారు.

ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



కమలాపూర్ : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక సీఐ హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని హైటెక్ ఇంటర్నేషనల్ స్కూల్ 13వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బత్తిని శ్రీధర్, ప్రిన్సిపాల్ బత్తిని రాము, డైరెక్టర్లు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లాలను తలపిస్తున్న రోడ్లు

- రోడ్లపైనే ధాన్యం ఆరబోసిన రైతులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కమలాపూర్ : వాహనదారులారా.. తస్మాత్ జాగ్రత్త, ఏ మాత్రం ఆదమరిచి ప్రయాణించినా ప్రమాదాల బారిన పడి గాయాపడడమో లేక విగతజీవులుగా మారడమో ఖాయం. ఎందుకంటే మండల వ్యాప్తంగా రోడ్లన్నీ రైతులు ఆరబోసిన వరిధాన్యం రాశులతో నిండిపోయి కల్లాలను తలపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం శనిగరం గ్రామశివారులో రోడ్డుపై ఆరబోసిన వరి ధాన్యం కారణంగా ఐదుగురితో ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతలి పక్కకు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనతో రోడ్లపై వరి ధాన్యం ఆరబోస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఓ వైపు పోలీసులు హెచ్చరిస్తున్నా రైతుల నుంచి స్పందన కనిపించడం లేదు. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసుకోవాల్సిన రైతులు ఇందుకు విరుద్ధంగా మండలంలోని ప్రధాన రహదారుల వెంట, వాగులపై నిర్మించిన వంతెనలపై ధాన్యం ఆరబోస్తుండటంతో రోడ్ల వెంట ఎక్కడ చూసినా రైతులు ఆరబోసిన వరి ధాన్యమే కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం నెలకొంది. ప్రమాదాలు జరుగకముందే రహదారుల వెంట రైతులు ధాన్యం ఆరబోయకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కమలాపూర్-ఉప్పల్ మధ్యలో రోడ్డు వెంట ఆరబోసిన ధాన్యం



ఉప్పల్ చెరువు మత్తడి-కన్నూరు మలుపు వద్ద..

ప్రమాదాల నివారణకు సహకరించాలి



రైతులు పండించిన పంట ఉత్పత్తులను కల్లాల్లో లేదంటే కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకోవాలి. రహదారుల వెంట ఆరబోయవద్దు. ఈ మేరకు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రమాదాల నివారణకు రైతులు సహకరించాలి, లేదంటే కేసులు నమోదు చేస్తాం. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి.

– హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్

గాలివాన బీభత్సం

- నేలకూలిన మామిడి చెట్లు, రాలిన కాయలు
- రూ.లక్షల్లో నష్టం వాటిల్లిందని అన్నదాత కన్నీరు

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. రెండు మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమైపోయారు. వరిపొలాలు, మొక్కజొన్న పంటలు నేలవాలగా గాలి దుమారానికి మామిడి చెట్లు సైతం నేలకొరిగాయి. మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన పల్లా సురేందర్‌రెడ్డి, గాదె రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, హరినాథ్ రెడ్డి, మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బట్టు అంజయ్య లకు చెందిన మామిడి తోటల్లో భారీగా కాయలు నేలరాలాయి. కొన్ని రోజుల్లో మామిడి పంట చేతికొస్తుందని రైతులు ఆశపడగా గాలి దుమారానికి చెట్లు కూలి, కాయలు రాలిపోవడంతో భారీనష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఉద్యానవన శాఖ హనుమకొండ డివిజన్ అధికారి సుష్మిత రాలిన మామిడి కాయలను, కూలిన చెట్లను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తానని తెలిపారు. ప్రభుత్వం పరి హారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



గుండ్లసాగర్‌లో కూలిన మామిడి చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి సుష్మిత

పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళి



కమలాపూర్ : పహల్గాం మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు




పరకాల : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు




శాయంపేట : కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్ : జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిలో మృతి చెందిన వారికి భారతీయ జనంతా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కమలాపూర్, పరకాల, శాయంపేట, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండల కేంద్రాల్లో, హుజూరాబాద్-పరకాల ప్రధాన రహదారిపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. హిందూ మతాన్ని టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడటాన్ని యావత్ ప్రపంచం ముక్తకంఠంతో ఖండిస్తోందన్నారు. జమ్ముకశ్మీర్ పెహల్గంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ బీజేపీ శ్రేణులు ఎల్కతుర్తిలో నిరసన తెలిపి పాకిస్తాన్ జెండా దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ, మండల, గ్రా మశాఖ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తిలో..



భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో..

25 లీటర్ల గుడుంబా పట్టివేత

- మహిళ అరెస్ట్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో ఒక మహిళ వద్ద 25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ఆమెను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని సూర్యనాయక్ తండాకు చెందిన జర్పుల మంగమ్మ బుధవారం పత్తిపాకలోని సెంటర్‌లో గుడుంబా అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో సిబ్బందితో కలిసి వెళ్లాము. సెంటర్‌లో మంగమ్మను పట్టుకొని తనిఖీ చేయగా 25 లీటర్ల గుడుంబా లభ్యం కాగా స్వాధీనం చేసుకొని మంగమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా గుడుంబా అమ్మినా తయారు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు గుడుంబా విక్రయాలు చేయకుండా ఏదైనా ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.



గుడుంబా అమ్ముతున్న మహిళను పట్టుకున్న పోలీసులు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఐనవోలు : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఐనవోలుకు చెందిన శాగంటి సురేందర్, శాగంటి ప్రకాష్‌లు ఈ నెల 19న రాత్రి తమ ద్విచక్రవాహనంపై సోదరులు హనుమకొండకు వెళ్లి మరో ఐదు నిమిషాల్లో ఇంటికి చేరుతామనుకున్న క్రమంలో లక్ష్మీపురం సమీపంలో రోడ్డు ప్ర మాదానికి గురయ్యారు. వెంటనే స్థానికులు గాయపడ్డ ఇద్దరిని చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ ఈ నెల 20న ప్రకాష్ మృతి చెందాడు. కాగా చికిత్స పొందుతున్న సురేందర్ బుధవారం మృత్యువాత పడ్డాడు. దీంతో ఒకే కుటుంబంలోని ఇద్దరు సోదరులు మృతి చెందడంతో మండల కేంద్రంలో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం బాధిత కుటుంబాలను అఖిల భారత దోబీ సమాజ్ నేత ఉల్లెంగుల యాదగిరి పరామర్శించారు. పరా మర్శించిన వారిలో తెలంగాణ రాష్ట్ర శాలివాహన సంఘం అధ్యక్షుడు అమరవాది సారంగపాణి, మండల రజక సంఘం ఉపాధ్యక్షుడు శాగంటి యాదగిరి. ప్రధాన కార్యదర్శి లొంక సుధాకర్ తదితరులు ఉన్నారు.

చీటింగ్ చేసిన వ్యక్తిపై కేసు


శాయంపేట : మండల కేంద్రానికి చెందిన గన్ను సంతోష్‌కుమార్ వద్ద సురేష్ క్రెడిట్ కార్డు తీసుకొని డబ్బులు వాడుకొని ఇవ్వకపోవడంతో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి సంతోష్‌కుమార్ వద్ద హనుమకొండకు చెందిన వొల్లాల సురేష్ క్రెడిట్ కార్డు తీసుకొని కార్డులోని రూ. 1.67లక్షలను వాడుకొని సంతోష్‌కుమార్‌కు డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుడంతో సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు సురేశ్‌ను పట్టుకొని చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. లోన్‌యాప్ పేరుతో కాని, లోన్లు ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని చీటింగ్ చేసినట్లు తెలిస్తే తమకు సమాచారం అందిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

కూతురికి తెలియకుండా తండ్రి అంత్యక్రియలు

దామెర : తన తండ్రి మృతదేహాన్ని తనకు తెలియకుండా అంత్యక్రియలు చేసిన ఘటన మండలంలోని ఊరుగొండలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేవులపల్లి సదానందం(65) అనారోగ్యంతో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో బుధవారం మృతి చెందాడు. కాగా కుటుంబ సభ్యులు సదానందం స్వగ్రామమైన ఊరుగొండకు తీసుకువచ్చి తన వ్యవసాయ బావి వద్ద అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో సదానందం కూతురు కూచన సంధ్య తన తండ్రి మరణవార్త అంత్యక్రియల అనంతరం తెలిసిందని ఆరోపించింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. దామెర ఎస్సై కొంక అశోక్ వివరణ కోరాగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సదానందం భార్య, కుమారుడు కలిసి అంత్యక్రియలు చేసినట్లు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలో బుధవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు చేరడంతో బుధవారం పోటీగా కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలను కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కాగా ఇందులో మంగళవారం కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరి కొందరు తిరిగి బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరి వారిలో పొన్నం గోపాల్, కంజర్ల సురేష్, కంజర్ల అశోక్, మధుకర్, పూలమ్మ, సాంబయ్య తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలతో నాయకులు

పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు: కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో ఘోరంగా విఫలమైందని, ఎన్నో ఆశలతో ప్రజలు నమ్మి వారిని గద్దెనెక్కిస్తే ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని లింగమోరిగూడెంలో బుధవారం యువజనులు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అవి తీర్చకుండా కేవలం కాలం గడుపుతుందన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. బీఆర్ఎస్ 25 ఆవిర్భావోత్సవ సభకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ వస్తుండడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులను, సామాన్య ప్రజలను, అన్ని వర్గాల వారిని మోసం చేసిందన్నారు. దీంతో బీఆర్ఎస్‌ను తాము ఎక్కడి వెళ్లినా ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో బేతి సాయి, రాహుల్, సన్నీ, సిద్ధు, మదార్, సాజిత్, రంజాన్, ఎస్‌డీ హోలి, చిన్న కాసింతో పాటు పెద్ద ఎత్తున చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఏపీఎం దేవానంద్



డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రలో మాట్లాడుతున్న ఏపీఎం దేవానంద్

ఎల్కతుర్తి : డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, మాదక దవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం దేవానంద్ అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలో జేఏసీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర మూడో రోజు మండలంలోని మల్లారం, రసూల్‌పల్లి, కొత్తకొండ, ధర్మారం, చంటయ్యపల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిండ్రులపై ఉందన్నారు. వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. మత్తు పదార్థాలు ఆరోగ్యాలను నిర్వీర్యం చేస్తూ ఎంతోమంది జీవితాలు మధ్యంతరంగా ఆగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి, డ్యాగల సారయ్య, చెప్యాల ప్రకాష్, ఎదులపురం తిరుపతి, గూడెం రాజిరెడ్డి, పద్మ, శ్రీదేవి, సధానందం, జగదీష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభాస్థలి పరిశీలన

శాయంపేట : ఈ నెల 27న హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి క్రాస్‌రోడ్ వద్ద నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాల రజతోత్సవ భారీ బహిరంగ సభాస్థలిని బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి శాయంపేట మండల బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. వారి వెంట మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, నాయకులు మేకల వెంకటేశ్వర్లు, దాసి శ్రావణ్‌కుమార్, గాదె రాజేందర్, మేకల శ్రీనివాస్, మారెపల్లి నందం, గంటా శ్యాంసుందర్ రెడ్డి, మొహిబొద్దీన్, అట్ల తిరుపతి, కరణ్‌బాబు, అజయ్, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.



రజతోత్సవ సభాస్థలి వద్ద బీఆర్ఎస్ నాయకులు

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

వేలేరు : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వరుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. అనంతరం ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన తాళ్లపెల్లి అయిలయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి వసంత ట్రస్ట్ ద్వారా పెద్ది వెంకటనారాయణ గౌడ్ 50 కిలోల బియ్యం అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు దస్తరి కిశోర్, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొనసాగుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

కేయూ క్యాంపస్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చేస్తున్న సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరింది. ఈమేరకు కేయూ గేట్ వద్ద మోకాళ్ల మీద నిలబడి చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. తొలుత పరిపాలన భవనం నిర్వహించిన దీక్షకు ఏఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లాఖాద్రీ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, ఖమ్మం పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, జేఏసీ బాధ్యులు కరుణాకర్‌రావు, రాజేష్, శ్రీధర్‌కుమార్ లోథ్, సత్య, శ్రీనివాస్, సిద్ధార్థ, సూర్యం, సూర్యనారాయణ, వీణ, శ్రీదేవి, శ్రీలత, కవిత, సరిత, వాణిశ్రీ, శ్రీజ, దీప్తి, ఫాతిమా, బ్లెస్సీ, పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల వినూత్న నిరసన

ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పరిపాలన భవన వద్ద అధిక విద్యార్హత గల డాక్టరేట్ పట్టాలను ప్రదర్శిస్తూ పార్ట్‌టైం అధ్యాపకులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ గత 15 – 20 ఏళ్లుగా విశ్వవిద్యాలయాల్లో పార్ట్‌టైం లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. జీఓ 21లో పార్ట్‌టైం అధ్యాపకుల సర్వీస్‌ను పరిగణలోకి తీసుకోకపోవడం శోచనీయమన్నారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేంద్రనాయక్, దేవోజీ నాయక్, మోహన్, తిరుణహరి శేషు, వినోద, భాగ్యమ్మ, నాగేశ్వర్‌రావు, ప్రవీణ్, సంజీవ్, సుజాత, రవీందర్, విజయ, వాణిదేవి, సరిత, జ్యోత్స్న పాల్గొన్నారు.



డాక్టరేట్ పట్టాలతో నిరసన తెలుపుతూ..